578) సామంతం / సామ

ప॥ పాడైన యెరుకతో బంధమోక్షములొక్క |గాడి గట్టుట తెలివి గానకే కాదా ॥

చ॥ భావించి నిను బరబ్రహ్మమని వేదములు |వేవేలు విధుల మొరవెట్టగాను |
కేవలపు నిన్ను దక్కిన దైవములగూర్చి |సేవింపుటిది తప్పుసేయుటే కాదా ॥

చ॥ సరిలేని నిను నుపనిషద్వాక్యములె పరా- |త్పరుడవని నలుగడల బలుకగాను |
వరుసతో బెక్కుదైవములు సంగడినిన్ను |తొరల గొలుచుట మహాద్రోహమే కాదా ॥

చ॥ ఎందుజూచిన పురాణేతిహాసములు నీ- |చందమే యధికమని చాటగాను |
కందర్పజనక వేంకటగిరిస్వామి నీ- |కందువెఱగనిది యజ్ఞానమే కాదా ॥